క్లుప్తంగా

వింజమూరుకు అదనంగా బస్సు సౌకర్యం

బాన్సువాడ: వింజమూరుకు అదనంగా మరో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ డీఎం సరితాదేవి తెలిపారు. బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం 1:45 గంటలకు వింజమూరుకు బయలుదేరి వెళ్తుందని, సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ నెల 10న అదనంగా సాయంత్రం 5 గంటలకు, 12న సాయంత్రం 4 గంటలకు డీలక్స్ బస్సులు బాన్సువాడ బస్టాండ్ నుంచి బయలుదేరి నిజామాబాద్, కామారెడ్డి, జేబీఎస్, హైదరాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని వింజమూర్‌కు వెళ్తాయని ఆమె అన్నారు.

క్యాలెండర్, డైరీల బహూకరణ



కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్ రావు, నాయకులు సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను, జిల్లా ట్రెజరీ అధికారులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీలను బహూకరించారు. ప్రతినిధులు మల్లేషం, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాకు సంబంధించి పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబీర్ మనోహర్‌రావు, జనపాల లక్ష్మీనారాయణలు సోమవారం డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు. వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం ఆనంద్ శ్రీ విభుషిక్ జగద్గురు రామానందచార్య శ్రీ స్వామి నరేంద్ర చారి మహరాజ్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ...రక్తదానం చాలా గొప్పదని, రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చన్నారు. మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ రెడ్ క్రాస్ డివిజనల్ అధ్యక్షుడు వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి బీఎస్‌ఏ అవార్డు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మిర్జాపూర్ సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మొర్గె భూమయ్య బహుజన సమాజ్ సాహిత్య అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఈ అవార్డును అందుకున్నారు.

దేవునిపల్లి విద్యార్థులకు బూట్ల వితరణ



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌సీఎస్ ట్రస్ట్ చైర్‌పర్సన్ భారతి శ్రీవారి ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చేతుల మీదుగా బూట్లు పంపిణీ చేపట్టారు. స్థానిక వార్డ్ కౌన్సిలర్ కాసర్ల గోదావరి స్వామి, హెచ్ఎం గంగా కిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, శ్రీనివాస్, సాయిలు, కరుణ, మానస, సుష్మ పాల్గొన్నారు.

రైతులు ధర్నాకు తరలి రావాలి

రామారెడ్డి: మండల కేంద్రంలో నేడు తలపెట్టిన ధర్నాకు మండల రైతులు తరలి రావాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత నారెడ్డి దశరథ్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరానికి రూ.15 వేల రైతుబంధును ఇవ్వాలనే డిమాండ్‌తో ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశాలు

రాజంపేట: పెండింగ్ దరఖాస్తులను త్వరితగతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించినట్లు స్థానిక తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో రఘురాం, ఎంఏవో శృతి, ఎంఈవో పూర్ణచంద్రరావు, ఏపీఎం సాయిలు, మిషన్ భగీరథ ఏఈ రజిత, తదితరులు పాల్గొన్నారు .

పొలాల్లో ప్లాస్టిక్ భూతం

- మురుగు నీరు, వ్యర్థాలతో రైతులకు ఇబ్బందులు
- దిగుబడి తక్కువ రావడంతో నష్టపోతున్న అన్నదాతలు



ఫిల్టర్ బెడ్ వద్ద వరి పంటలోకి వచ్చిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు



పంట కాలువలోకి వస్తున్న మురికినీరు

బాన్సువాడ : పచ్చని పంట పొలాలు ప్లాస్టిక్ మయమవుతున్నాయి. పంట పొలాలు మురికి నీరు, వ్యర్థాలతో నిండి పోవడంతో సాగు చేయలేని పరిస్థితిలోకి అన్నదాతలు వెళ్తున్నారు. పంటలు సాగు చేసుకునే కొందరు రైతులు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పంట పొలాలను చూసి నాట్లు వేయడానికి కూడా కూలీలు రావడం లేదు. బాన్సువాడ పట్టణానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు బాన్సువాడ, చింతల్‌నాగారం శివారుల్లో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాంపూర, బీసీ కాలనీ, గొలీగూడ, హర్సత్ కాలనీ, వాసవీ కాలనీ, తాడ్కోల్ రోడ్డు, తాడ్కోల్ శివారులో నూతనంగా నిర్మించిన 1000 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన మురుగు నీరు, వ్యర్థాలు పూర్తిగా పంట పొలాల్లోకి వచ్చి చేరుతున్నాయి. పచ్చగా ఉండే పంట పొలాలు నేడు మురుగు నీటితో పాటు ప్లాస్టిక్ విషం చిమ్ముతుంది. మురికి నీరు అధికంగా ప్రవహిస్తుండడంతో పంటలు సాగు చేసుకునేందుకు వీలులేకుండా పడావుగా (బీడు) మారుతున్నాయి. బాన్సువాడ శివారులో సుమారు 100 ఎకరాల కంటే ఎక్కువగానే పంట భూముల్లో తుంగ పెరిగిపోవడంతో సాగు చేసుకునేందుకు వీలులేకుండా పోయింది.

నాట్లు వేయడానికి ముందుకు రాని కూలీలు

కొందరు రైతులు ఇబ్బందులు పడుతూ పంటలు సాగు చేస్తున్నా నాట్లు వేయడానికి కూలీలు రావడం లేదు. ఎలాగోలా ఇబ్బందులు పడి నాట్లు వేస్తే సాగు చేసిన పంట దిగుబడి రాక ఆర్థికంగా చితికి పోతున్నారు. తాడ్కోల్ రోడ్డులో గల ఎల్లయ్య చెరువు కట్ట వద్ద నుంచి సీసీ డ్రైనేజీని ఫిల్టర్ బెడ్ మీదుగా సంగమేశ్వర కాలనీ చివర వరకు నిర్మిస్తే రైతుల సమస్య పూర్తిగా తొలగిపోతుందని రైతులు అంటున్నారు. గతంలో మురికి నీటి ప్రవాహం తక్కువగా ఉండేది. ప్రస్తుతం తాడ్కోల్ శివారులో నూతనంగా 1000 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించడంతో సమస్య ఉత్పన్నమైంది. వర్షాకాలంలో మాత్రం రైతుల బాధలు వర్ణాతీతం. ఈ డబుల్ బెడ్ రూం ఇళ్ల పక్కనే పంట భూములు ఎక్కువగా ఉండడంతో మురికినీరు, వ్యర్థాలు అధికంగా వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సీసీ డ్రైనేజీని నిర్మిస్తే మురికినీరు, వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు ఈ డ్రైనేజీలోకి వెళ్తాయి. చివరకు మురుగు నీరు, ప్లాస్టిక్ వస్తువులు నాగారం సమీపంలోని మంజీరాలో కలుస్తాయి. దీంతో సుమారు 100 ఎకరాల వ్యవసాయ భూములు సాగు చేసుకునే అవకాశం కలుగుతుంది.

సాగు చేయలేకుండా మారింది

మురికి నీరు పెద్ద ఎత్తున పంట పొలాల్లోకి వస్తున్నాయి. పంటలు సాగు చేయాలంటే నరకం కనబడుతుంది. నాట్లు వేయడానికి కూలీ లు కూడా రావడం లేదు. సీ సీ డ్రైనేజీని నిర్మిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. మా రైతుల సమస్యల గురించి ఏవరూ పట్టించుకోవడం లేదు.

– పత్తి కాశీరాం, రైతు, బాన్సువాడ

మురికినీరు వెళ్లేలా చూడాలి

ఫిల్టర్‌బెడ్ నుంచి సీసీడ్రైనేజీ ని ఊరి చివర వరకు నిర్మిస్తే మురికినీరు వాగులో కలుస్తుంది. చాలాసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మా భూముల్లో నాట్లు వేయాలంటే ట్రాక్టర్లు నడవడం లేదు. నాట్లు వేయడానికి కూలీలు రావడం లేదు. పంట కూడా పండటం లేదు.

–కొంకి విఠల్, రైతు, బాన్సువాడ

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను సత్వరమే అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో గద్దెనెక్కిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఏటా ప్రతి ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి రూ.12 వేలు ఇస్తామని మోసం చేస్తున్నారన్నారు. మహిళలు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. మహిళలకు ప్రయాణం ఉచితం అని చెప్పి బస్సులను తగ్గించి అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు జలంధర్ రెడ్డి, సతీష్, నాగం సురేందర్, మనోహర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై వైద్య సిబ్బందికి అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి వ్యాధుల నివారణ, చికిత్సపై పీహెచ్‌సీ వైద్యురాలు హిమబిందు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యాధుల నివారణ, నియంత్రణ, ముందు జాగ్రత్త చర్యల గురించి సిబ్బందికి వివరించారు. ప్రతీ బీపీ, షుగర్ పేషెంట్లకు నెలనెలా మందులు అందజేసి ఎన్‌సీడీ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, జిల్లా కో–ఆర్డినేటర్ సిద్దిరామేశ్వర్, సూపర్‌వైజర్ ఫరీదా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి: లక్ష్మాపూర్‌లో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సామెల్ తదితరులున్నారు.

స్కూల్‌బ్యాగులు, బుక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం స్కూల్ బ్యాగులు, నోటు బుక్కులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువు కోవాలని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రజితారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

నిజాంసాగర్(జుక్కల్): వరి నాటు వేస్తున్న సమయంలో వరిపైరు కొనలు తొలగిస్తే కాండం తొలుచు తెగులును నివారించవచ్చని ముగ్దంపూర్ క్లస్టర్ ఏఈవో రేణుక సూచించారు. సోమవారం మహమ్మద్ నగర్ మండలంలోని నడిమి తండాలో వరినాట్లు వేస్తున్న రైతులకు ఏఈవో పలు సూచనలు ఇచ్చారు.

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన సదస్సు

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పలుగుగడ్డ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం కౌమారదశపై వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, వర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వంశీకృష్ణ, శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నేతలు ముదాం అరుణ్‌కుమార్, ఎస్. అజయ్, మణికంఠ, రాహుల్, నితిన్, నవీన్, సన్నీ, నరేష్ పాల్గొన్నారు.


ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు మంజూరు చేయించిన ఘనత ఏఐటీయూసీదే

కామారెడ్డి అర్బన్: మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాటం చేస్తూ, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, క్యాజువల్ సెలవులు మంజూరు చేయించిన ఘనత ఏఐటీయూసీదేనని రాష్ట్ర అధ్యక్షుడు వి.జైపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీఎల్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ నీటి సరఫరా విభాగం(ఏఐటీయూసీ) కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ మున్సిపల్ నీటి సరఫరా విభాగం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మీర్జా అయాజ్ బేగ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నర్సింగరావు, జిల్లా అధ్యక్షుడిగా మార్వాడి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేందర్‌లు ఎన్నికయ్యారు.

ఏటీఎం కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గాంధారి(ఎల్లారెడ్డి): సహకార బ్యాంకు ఏటీఎం కేంద్రాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ సాయికుమార్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక సహకార బ్యాంకు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నిజాంసాగర్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు, కళాకారులు

కామారెడ్డి క్రైం: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణ పోలీసులు సోమవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారుల బృందంతో పాటల రూపంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ ఎస్సై మహేష్ సూచించారు. ఎస్సైలు బాల్ రెడ్డి, వినయ్ సాగర్, శ్రీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరం

కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం డీటీవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రవాణాశాఖ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున రక్తదానం చేసినట్లు డీటీవో తెలిపారు.

నిబంధనలు పాటించాలి

రామారెడ్డి : రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని రామారెడ్డి ఏఎస్సై రవీందర్ సూచించారు. రామారెడ్డిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కానిస్టేబుళ్లు పవన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గాంధీ సోమవారం తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లలో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఏప్రిల్ 13న అర్హత పరీక్ష ఉంటుందన్నారు. ఆరవ తరగతి వారికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట మోడల్ పాఠశాలలో ఆరు నుంచి పదోతరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య సోమవారం తెలిపారు. ఫిబ్రవరి 28 లోపు ఆన్‌లైన్లల్లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 3న డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఐదో తరగతిలో చేరేందుకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష, బ్యాక్ లాగ్ సీట్లకు(6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు.

ఆపదలో అండగా సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థికసాయం ఆపన్నహస్తంగా నిలుస్తోందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వంరెడ్డి, నర్సింహులు, రాజేశ్వర్‌గౌడ్, గోపన్‌పల్లి సాయిలు, సయ్యద్ జలీల్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బిచ్కుందలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/బిచ్కుంద(జుక్కల్): సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా మారిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుంద మార్కెట్ యార్డులో, జుక్కల్ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సుమారు 146 మంది లబ్ధిదారులకు రూ.1 కోటి విలువైన చెక్కులు పంపిణీ చేశారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, గంగాధర్, గోపాల్‌రెడ్డి, రవి పటేల్, నాగ్‌నాథ్ పటేల్, రమేశ్ దేశాయ్ తదితరులున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను తరలించొద్దు



వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను సిద్దిపేట జిల్లా తోర్నాలకు తరలించవద్దని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం తమ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ కళాశాలను మరో చోటుకు తరలించవద్దన్నారు. సరైన వసతులు లేకపోవడంతో ఇక్కడి కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడంలేదని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మాల్తుమ్మెద పాలిటెక్నిక్ కళాశాలలో పూర్తిస్థాయి వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిద్దయ్య, మండల ప్రధాన కార్యదర్శి యాదగిరి, మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిన మున్సిపల్ కార్మికులు



కామారెడ్డికి తరలివెళ్తున్న మున్సిపల్ కార్మికులు

బాన్సువాడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మర్చిపోయారని విమర్శించారు. సమ్మెలో భాగంగానే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఖలీల్, తదితరులున్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి



తాడ్వాయిలో మాట్లాడుతున్న సంతోష్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని స్థానాలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలో 25 బూత్ కమిటీలను ఎన్నుకున్నామని అన్నారు. తాడ్వాయి బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. మండలంలో 32 బూత్‌లు ఉండగా అందులో 25 బూత్‌లకు కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు స్వామిరెడ్డి, నేతలు ముదాం దత్తు, ముదాం మహేష్, సుమన్‌రెడ్డి, మహిపాల్, స్వామి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ గ్రామంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బూత్ కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. గ్రామంలోని 55, 56 బూత్‌లకు అధ్యక్షులుగా కోరబోయిన కిషన్, మామిడి అనిల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. బీజేపీ కార్యవర్గ సభ్యులు గంగాధర్ రావు, శక్తికేంద్ర నిర్వాహకులు, మాజీ ఎంపీటీసీ మహిపాల్ యాదవ్, మండల కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఓబీసీ మండల కార్యదర్శి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేరళ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

కామారెడ్డి రూరల్ : నాగిరెడ్డిపేట్ మండలం గోపాల్‌పేటలో ఉన్న కేరళ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ భారతీయ విద్యార్థి మోర్చ(బీవీఎం) నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్, నాయకులు శ్రవణ్, అభిలాశ్, శ్రేయస్ తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం..



దోమకొండ: మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోసనపల్లి శివలింగం, అధికార ప్రతినిధిగా నత్తి గణేశ్, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, కార్యదర్శిగా ఎర్రని స్వామి, సభ్యులుగా శ్రీనివాస్, రంజిత్, రవీందర్ తదితరులను ఎన్నుకున్నారు.

మున్నూరు కాపు సంఘం..

కామారెడ్డి రూరల్: అడ్లూరు గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదాం నర్సింలు, ఉపాధ్యక్షులుగా ఒడిశెట్టి రాజు, ఉప్పు వేణు, ప్రధాన కార్యదర్శిగా తోట రాజయ్య, సహాయ కార్యదర్శిగా సంగెం రాజేందర్, కోశాధికారిగా ఉప్పు బాలచంద్రం ఎన్నికయ్యారు.

గంజి గుమాస్తాల సంఘం ..

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలో గంజి వర్తక సంఘం కార్యాలయంలో గంజి గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీ మోహన్ రావు, ఉపాధ్యక్షుడిగా ఎ.రాజేంద్రరావు, కార్యదర్శిగా గోపు సంతోష్, సహాయ కార్యదర్శిగా పయ్యావుల శ్రీనివాస్, కోశాధికారిగా పాత ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా ఏలేష్ యాదవ్, ఆర్కిటీ సంజీవరెడ్డి, దేవుని వెంకటేశం, ఆకుల రవీందర్, కళాలి లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, కె.చంద్రమౌళి, అంజయ్య తదితరులను ఎన్నుకున్నారు.